# రక్తపు మరకలు

మధ్యాహ్నం రెండు కావస్తుంది.

జాతీయ రహదారి మీద పరుగెడుతున్న వ్యాన్ స్లో అయింది. ఎదురుగా రోడ్డుకు పర్లాంగు దూరంలో ఓ బోడు. దాని మీద తేనె పట్టుకు వాలిన తేనె టీగల్లాగ జనం. పూనకంతో ఊగుతున్న వాళ్లు కొందరైతే డోల్‌వాయిస్తు తాళాలను వేస్తు కొందరు.

మధ్యన ఓ గుండ్రని రాయిపై పసుపు కుంకుమ చల్లబడివుంది. దాని ఎదురుగ లెక్కపెట్ట లేనన్ని దీపాల ప్రమిదలు, అగరొత్తు పొగలు. చుట్టూర కళ్లు తెరిచి, నాలుక బయటికి వేలాడే గొర్రెల, మేకల తెగిపడ్డ తలకాయలు, మేడి చెట్టు క్రింద రాలిన మేడి పండ్లు లాగ అక్కడంతా పర్చుకొని వున్నాయి.

అక్కడి నేలంతా నెత్తురు చిత్తడి, రక్తం వాసన, దగ్గరికిరాగానే "ఆపు" అన్నాడు టీచర్. వ్యాన్‌ఆగింది.

అందరు వ్యాన్ దిగి, చుట్టు చూశారు. ఎటూ కనుచూపుమేర జనమే జనం. ఎడ్ల బళ్ళు బారులు తీరివున్నాయి. బళ్ళ ప్రక్కనే వంట చేసుకొనే ఏర్పాట్లు జరుగుతున్నాయి. పొయ్యిలు రాజుతునే వున్నాయి. ఆడవాళ్ళు బిందెలతో నీళ్ళ తెస్తున్నారు. మగవాళ్ళు మాంసాన్ని ముక్కలు చేస్తూవున్నారు. రోడ్డు ప్రక్కనే కొత్త కుండలు అమ్ముతున్న కుమ్మరితో సంభాషణ సాగించాడు టీచర్. "యిక్కడ ఏం జరుగుతూవుంది" టీచర్ ప్రశ్నించాడు.

"జాతర" ఇక్కడ రెండేండ్ల కొకసారి పెద్ద జాతర జరుగుతూంది. దీన్ని గట్టు జాతర అంటారు. దీనిని మొదట యాదవులే జరిపేదట. ఇప్పుడు అందరు వస్తూంటరు అన్నాడు కుమ్మరి.

" అట్లానా" టీచర్ తలవూపుతూ అన్నాడు.

" సార్ ఎంత రక్తం?" ఒక విద్యార్థి ఆశ్చర్యంగా అన్నాడు.

" అన్ని యాటల నర్కినంక యిగ రక్తముండదా" కుమ్మరి అన్నాడు.

అందరు బోడు వైపు చూస్తు నిలుచున్నారు.

అక్కడ డోల్ చప్పుడు మారు మ్రోగుతోంది. దానికి తోడు వున్న తాళాల చప్పుడు. కల్లు - సారల, సాకలు బోడు మీద నుండి చిన్న చిన్న పాయలుగా కిందికి జారుతున్నవి. తాగిన మత్తులో జనం వూగుతున్నారు. ఆడా మగా తేడాలేదు. పూనకం వచ్చి వందల మంది వంటి మీద గుడ్డల సోయి లేకుండా వూగుతున్నారు.

వంటిమీదంతా పసుపు -కుంకుమ, నడుముల చుట్టు మువ్వలు. పాదాల నుండి మోకాల్ల వరకు మువ్వలు గల పట్టీలను కట్టుకున్నారు.

" ఇదొక అజ్ఞానపు ఆనందం, దేవుని పేరుతో జరిగే మూఢాచారపు బలి" అన్నాడు టీచర్ నిరసనగా.

"సార్ ఎంత జనమొచ్చారో చూడండి" చుట్టూ చూస్తూ అన్నాడు మూర్తి.

" ఆరక్తాన్ని చూస్తే కళ్లు తిర్గుతున్నాయి సార్" అన్నాడు శర్మ.

" ఈ గొర్రెల మాంసానంతా తింటారాసార్" అన్నాడు మూర్తి.

"అదిగో వంటలు జరుగుతూనే వున్నాయి" అంటూ చుట్టూర మండుతున్న పొయ్యిలను చూపించాడు కుమ్మరి.

" వీళ్లంతా చదువుకుంటే బాగుండు, యిలా చేయకపోదురు" శర్మ.

అవును అన్నట్టు తల ఆడించాడు టీచర్. అక్కడక్కడా పోలీసువాళ్లు చెట్లకింద నిలుని చోద్యం చూస్తున్నారు.

ఉన్నట్టుండి శర్మ టీచర్ ముందుకొచ్చి "ఇంత అజ్ఞానంగా యింత బీభత్సంగా జంతుబలి జరగకుండా ప్రభుత్వము చర్యతీసుకొవాలి గదా సార్" అన్నాడు.

"పేపర్లో చూడలేదూ? ఆ పని చేస్తునే వున్నారనుకో! అయినా జనం చేస్తున్నది తప్పు అని వాళ్లు తెలుసుకుంటేనే ఆగుతుంది తప్పా; చట్టాలతో మాయమయ్యే ఆచారాలు కావు." అన్నాడు టీచర్.

"అట్లా గూడ చేసి చూసింద్రయా" అంటూ కుమ్మరి టీచర్‌వైపు మళ్ళి చెప్ప సాగాడు.

"ప్రభుత్వం జంతుబలిని నిషేధించింది జంతుబలి ఇవ్వకూడదని ఎంతో ప్రచారం చేశారు. గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. సందేళ జాతర మొదలైంది. పోలీసులు ఎవ్వరు కూడ మేకలను, గొర్రెలను నర్కొద్దు అని మైక్‌పెట్టి చెప్తూనే వున్నారు. సరే అని బోనాలు పెట్టి కల్లు - సారాను ఆరపోస్తం అని సోకలు పెడుతు వున్నారు.

రాత్రి పదైంది, పదకొండు అయ్యింది. వొట్టి బోనాలు నే కదా1 "హమ్మయ్య" అని పోలీసులు టోపీలను చేతుల్లోకి తీసుకొని, లాఠీలను కింద పడేసి అక్కడ అక్కడ కూర్చున్నారు. ఆపేటందుకు వొచ్చిన సర్కారు ఆఫీసర్లు కాస్త ఊపిరి పీల్చుకుంటున్నారు.

పన్నెండు అయ్యింది.

బోడు మీద ఒక్కసారే డోల్‌దెబ్బ మోగింది.

అంతట "ఓలింగ" అంటూ కేకలు అరుపులు.

రెప్పపాటు జీవాలను ఎత్తుకొని మిడతల్లాగ జనం బోడు చుట్టు చేరారు.

ఈ సారి బోడు మీద " ఓ లింగా" అని అరుపు.

అంతే " అంబా, అంబా" అని వేలాది జీవాల అరుపు.

అక్కడ భూమి, చెట్టు పుట్ట అంతా ఎరుపే ఎరుపు.

పోలీసులు టోపి పెట్టుకుని లాఠీ అందుకునే లోపే అంతా జర్గిపోయింది.

ఆపాలని వొచ్చిన ఆఫీసర్లంతా రెప్పకొట్టకుండా చూసస్తూ నిలుచున్నారు.

" ఇంత జీవ హింస ఏ దేవుడు కోరుతాడు సార్" శర్మ.

" దేవునికి కోరికలుంటాయా ఏమన్నా! మనిషి కోరికలే దేవుని పేరుతో చేస్తూవుంటారు."

టీచర్ వ్యాన్‌వైపు నడువగా, అందరు ఆయనను అనుసరించారు.

" బుద్ధుని భూతదయ, గాంధి అహింస" అని మూర్తి అనే లోపే --

"అవన్నీ క్లాస్‌రూమ్ పాఠాలు"

" పోనీ" అన్నాడు టీచర్.

వ్యాన్ కదిలింది.

విద్యార్థులు మాత్రం కదలకుండా కూర్చున్నారు కాని వాళ్ల బుర్రలనిండా కదిలే ఆలోచనలే.

కథా నిలయం
689
శ్రీకాకుళం